క్లుప్తంగా

22న మారెమ్మ దేవర

ఎమ్మిగనూరు: మండల పరిధిలోని రాళ్లదొడ్డిలో ఈనెల 22న మారెమ్మ దేవర ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు కరుణాకర్‌రెడ్డి, రంగస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవర సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. సప్తమాంకముల్లో భాగంగా పడక సన్నివేశం, శశిరేఖ–అభిమన్యుడి పరిణయం, ఉత్తర–అభిమన్యుడి సన్నివేశం, శ్రీ రామాంజనేయ యుద్ధం, చింతామణి భవాని పాత్ర, గయోపాఖ్యానం యుద్ధ సన్నివేశం, సత్య హరిశ్చంద్ర కాటి సన్నివేశం ఉంటాయన్నారు. స్థానిక కళాకారులతోపాటు ఎమ్మిగనూరు, అనంతపురానికి చెందిన రంగస్థల నటులు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో రబీ సీజన్ ముగియడంతో వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఓ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఉపాధి కూలీలు గ్రామాల్లో పనులకు వెళ్లేలా చూడాలన్నారు. రైతుల పొలాల్లో అవసరమైన పనులు గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు.

నిబద్ధతతో బోధన సాగించాలి

నందవరం: విద్యార్థుల ఎదుగుదలకు ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో బోధన సాగించాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలుగు మెయిన్, ఉర్దూ పాఠశాలలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. నాడు–నేడు రెండవ విడత అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. పిల్లలకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయంతి, సీఆర్పీ ఉరుకుందు ఉన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ఎమ్మిగనూరు: మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుతున్నట్లు ఎమ్మిగనూరు డిపో ఇన్‌చార్జ్ డీఎం నాగరాజు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మట్లాడుతూ.. శ్రీశైలానికి 54 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుస్తున్నాయన్నారు. అదేవిధంగా గురుజాల రామలింగేశ్వర క్షేత్రానికి శనివారం ప్రత్యేక బస్సు సర్వీసులు తిప్పుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తాగునీటి సౌకర్యం, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికుల భద్రత కోసం ఎప్పటికప్పుడు సీసీ టీవీల మానిటరింగ్, బస్సుల రాకపోకల వివరాలు అనౌన్స్‌మెంట్ చేస్తున్నామని తెలిపారు. మంత్రాలయం నుంచి బెంగళూరుకు రాయితీ టికెట్‌పై తిప్పుతున్న స్టార్‌లైన్ బస్సు సర్వీసు పట్ల ప్రజల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తితే బస్టాండ్ విచారణ కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చని, ఆర్టీసీ హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఆలూరు రూరల్: విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆలూరు ఏఈ లోకేష్ కోరారు. మండలంలోని హత్తిబెళగల్ రహదారిలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉండడంతో గ్రామస్తుల వినతి మేరకు శుక్రవారం సిబ్బందితో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కోసం దళారులను ఆశ్రయించవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయిన వారికి ఉచితంగా విద్యుత్ మీటర్ మంజూరు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చినట్లు చెప్పారు. విద్యుత్ సేవల్లో అంతరాయం ఏర్పడితే ఫోన్ 94408 13390 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

మద్దతు ధరకు శనగ కొనుగోలు

వెల్దుర్తి: రబీ సీజన్‌లో రైతులు పండించిన శనగ దిగుబడులను ప్రభుత్వం మద్దతు ధర క్వింటం రూ.5,335 ప్రకారం కొనుగోలు చేస్తుందని ఏఓ అక్బర్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన తెలుపుతూ మండలంలో శనగ పంట సాగు చేసిన రైతులు తమ దిగుబడులను మద్దతు ధరకు అమ్ముకునేందుకు గ్రామాల్లోని ఆర్బీకే సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే రబీలో వివిధ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని తెలిపారు.

ముగిసిన ఉరుసు



హీరా మోహినుద్దీన్ సమాధి

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడులో కొలువైన హీరా మోహినుద్దీన్ తాత ఉరుసు శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ నెల 15న గంధం, 16వ తేదీన ఉరుసు, శుక్రవారం ఉదయం జియారత్ వేడుకలు నిర్వహించారు. వివిధ గ్రా మాల నుంచి భక్తులు తరలి వచ్చి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

పరమేశ్వరుడి ఉత్సవాలకు వేళాయె







విద్యుదీపాల అలంకరణలో గురజాల రామలింగేశ్వరుడి ఆలయం, హొళగుంద సిద్ధేశ్వర స్వామి ఆలయం వద్ద పారుశుద్ధ్య పనులు చేయిస్తున్న దృశ్యం, విద్యుత్ కాంతులతో చుంచుఎర్రగుడి రామలింగేశ్వర స్వామి ఆలయం



గురజాలలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి



ఆలూరులో పూజలందుకుంటున్న పరమేశ్వరుడు



గిరిగెట్లలో ఉత్సవాలకు ముస్తాబైన బసవేశ్వరాలయం

సాక్షి నెట్‌వర్క్: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా పరమేశ్వరుడి పూజలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల్లో మూడు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. విద్యుదీపాలంకరణలో ఆలయాలు కొత్త శోభ సంతరించుకున్నాయి. భారీగా తరలివచ్చే భక్తుల కోసం సౌకర్యాలు కల్పించారు. తాగునీటి వసతి, చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ సౌకర్యం సిద్ధం చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేయనున్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. పరమ శివుడి సన్నిధిలో మహా శివరాత్రి వేళ జాగరణ చేసి స్వామి కటాక్షం పొందేందుకు భక్తులు సిద్ధమయ్యారు. భక్తుల కాలక్షేపం కోసం నాటక ప్రదర్శనలు, హరికథ, భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేశారు. ఆయా క్షేత్రాల వద్ద తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

- దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రంలో శనివారం నుంచి మహోత్సవాలకు అంకురార్పణ గావించనున్నారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటలకు మహా రథోత్సవం నిర్వహించనున్నారు.
- కృష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామంలో ఉమా మహేశ్వరస్వామి తిరునాల ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పి.లక్ష్మిరెడ్డి, రామకృష్ణారెడ్డిలు తెలిపారు. చుంచుఎర్రగుడి గ్రామంలో శనివారం రాష్ట్రస్థాయి కబడ్డీ, భజన పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించనున్నారు. పోటీల్లో పాల్గొనే వారు 94924 04979, 81878 68556 నంబర్లను సంప్రదించాలని గ్రామస్తులు తెలిపారు.



విద్యుదీపాలంకరణతో ముస్తాబైన బ్రహ్మగుండం క్షేత్రం

- బ్రహ్మగుండంలో వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డితో కలిసి స్వయంగా ఏర్పాట్లు పరిశీలించారు.

'బ్రహ్మగుండం' ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి

వెల్దుర్తి: బ్రహ్మగుండం క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లపై శుక్రవారం సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ పర్యవేక్షణలో 60 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా పోలీసులు, స్వచ్ఛంద వలంటీర్ల సేవలు ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. ఆలయ కళ్యాణ మంటపం ఎదురుగా రౌండ్ ది క్లాక్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏ చిన్న అవసరం, సమాచారం కోసం అక్కడ సంప్రదించాలని సూచించారు. రామళ్లకోట వైపు పొలంలో కార్ల పార్కింగ్, ఎంట్రన్స్ మండపం పక్కన బైక్ పార్కింగ్, వెల్దుర్తి వైపు రామిరెడ్డి మైన్స్ వద్ద ఆటో పార్కింగ్, ఎంట్రన్స్ వద్ద బస్సు పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రద్దీ ప్రదేశాలలో భక్తుల నగదు, ఆభరణాల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కల్యాణ సమయంలో తొక్కిసలాటకు తావివ్వరాదని, భక్తులకు ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా తిలకించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అత్యవసర సహాయం కోసం 91211 01118, 91211 01114 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పరిశీలన



ఆలూరు అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున

ఆలూరు: స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను శుక్రవారం వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (తిరుపతి రీజనల్ కోడింగ్ సెంటర్) డి.మల్లికార్జున పరిశీలించారు. రికార్డులు సరిచూసి ఎరువులు, పురుగు మందులు, విత్తనశుద్ధి ఉత్పత్తుల నాణ్యత పరీక్షలను పర్యవేక్షించారు. రైతులకు నాణ్యమైన వనరులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అగ్రి ల్యాబ్ టెస్టింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆలూరు ఏడీఏ సునీత, జిల్లా వ్యవసాయ అధికారి బాలవర్ధిరాజు, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఏఓ రాజేష్, ఏఈఓ షేక్షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: స్థానిక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను తిరుపతి ప్రాంతీయ కోడింగ్ సెంటర్ వ్యవసాయ ఉప సంచాలకులు డి.మల్లికార్జున శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, రసాయన ఎరువుల నాణ్యత పరీక్షలను పరిశీలించారు. అగ్రిల్యాబ్ సిబ్బందికి నాణ్యత, ప్రమాణాల గురించి సూచనలు అందించారు. పత్తికొండ ఏడీఏ విజయ మోహన్, ఏఓ బాలవర్ధిరాజు, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులతో కాలువకు మోక్షం

- ఆస్పరి చెరువుకు వర్షపు నీరు చేరేందుకు మార్గం



సుబ్బమ్మ కాలువలో పూడికతీత పనులు చేస్తున్న శంకరబండ ఉపాధి కూలీలు

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామం నుంచి ఆస్పరి చెరువుకు వర్షపు నీరు చేరే సుబ్బమ్మ కాలువ ఎన్నో ఏళ్లుగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో గడ్డి, ముళ్లకంపలు, రాళ్లతో నిండిపోయింది. దీంతో వర్షపు నీరు చెరువులోకి చేరకుండా వృథా అయ్యేది. ఉపాధి హామీ పథకం కింద కాలువలో పనులు చేపట్టి శుభ్రం చేస్తుండడంతో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు అవకాశం లభించింది. రూ.4.20 లక్షల ఉపాధి నిధులతో 4 మీటర్ల వెడల్పు, 1200 మీటర్ల పొడవుతో కాలువలో 2,880 క్యూబిక్ మీటర్ల మేర పూడిక తీసే పనులు చేపట్టినట్లు ఏపీఓ కృష్ణమోహన్ తెలిపారు. నెల రోజుల నుంచి 50 మంది కూలీలతో పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 800 మీటర్ల పొడవునా 1,920 క్యూబిక్ మీటర్ల పూడిక తీయించినట్లు చెప్పారు. మిగతా పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామని ఫీల్ అసిస్టెంట్ దేవదాసు చెప్పారు. ఈ కాలువ పూడిక తీయడం వల్ల శంకరబండ పొలాల నుంచి వచ్చే వర్షపు నీరు నేరుగా ఆస్పరి చెరువుకు చేరేందుకు ఆస్కారం ఏర్పడింది. చెరువు నిండితే ఆస్పరి పట్టణంతో పాటు మండలంలోని చొక్కనహళ్లి, పత్తికొండ మండలంలోని అటికెలగుండు, నలకదొడ్డి గ్రామాలలో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఒక్కసారి చెరువు నిండితే మూడేళ్ల పాటు తమ బోర్లులో నీరు తగ్గదని పేర్కొంటున్నారు. ప్రస్తుతం కాలువలో పూడిక తీస్తుండడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గా పరిసరాల్లో ఉంటున్న 55 ఏళ్ల గుర్తు తెలియని అనాథ వ్యక్తి శుక్రవారం అనారోగ్యంతో మరణించాడు. సదరు వ్యక్తి మూడు నెలల క్రితం ఎల్లార్తికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. దర్గా పరిసరాల్లో భిక్షాటన చేస్తూ కాలం గడిపే వాడు. శుక్రవారం దూదుపీర దర్గా ఉన్న కొండ మెట్ల వద్ద భిక్షాటన చేస్తూ అక్కడే కన్నుమూశాడు. ఆతని కుమారులు ఉన్నట్లు తెలిసింది. మృతదేహాన్ని చూసేందుకు ఎవరూ రాకపోవడంతో గ్రామానికి చెందిన ప్రజా సేవకుడు మల్లికార్జున, గ్రామస్తులు ఈరన్న, గాదిలింగ, బీజీ హళ్లి రమేశ్ తదితరుల సహకారంతో అంత్యక్రియలు జరిపించి మానవత్వాన్ని చాటుకున్నారు.

గ్యాస్‌స్టవ్, సిలిండర్ విరాళం

మద్దికెర: స్థానిక షిర్డీ సాయిబాబా దేవాలయానికి స్థానికుడైన కుండా రామాంజనేయులు జ్ఞాపకార్థం భార్య వెంకటలక్ష్మమ్మ, కుమారుడు సూర్యనారాయణ దంపతులు రూ.12 వేలు విలువ చేసే స్టీల్ గ్యాస్ స్టవ్, సిలిండర్‌ను విరాళంగా నిర్వాహకులు మల్లికార్జున, హరికి శుక్రవారం అందజేశారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఐచర్ వాహనం

- ఒకరికి గాయాలు

వెల్దుర్తి: స్థానిక హైవే–44పై కర్నూలు క్రాస్ హనుమాన్ జంక్షన్ యూటర్న్ వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. పట్టణానికి చెందిన టిప్పర్ వెల్దుర్తిలోకి క్రాస్ అయ్యేందుకు ఖాళీ లోడ్‌తో రాంగ్ రూట్‌లో రావడంతో కర్నూలు వైపు వేగంగా వెళ్తున్న చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఐచర్ డ్రైవర్ గమనించకుండా ఢీకొట్టాడు. ఐచర్ డ్రైవర్ చత్తీస్‌ఘడ్‌కు చెందిన ప్రసాద్ సాహు క్యాబిన్‌లో ఇరుక్కుని గాయపడగా టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని తన సిబ్బంది, హైవే పోలీసుల సాయంతో తాడు కట్టి ఐచర్ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు లాగారు. దీంతో డ్రైవర్ ప్రసాద్ సాహు రక్త గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించిన పోలీసులు హైవేలో ట్రాఫిక్ క్లియర్ చేశారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

తుగ్గలి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని డీవైఈఓ జే.సుకుమార్ సూచించారు. శుక్రవారం తుగ్గలి, జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పరీక్షలు దగ్గరపడుతున్నందున ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి మంచి ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకుని ఉత్తమ జీపీఏ సాధించాలని సూచించారు. ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. అనంతరం గిరిగెట్ల ప్రాథమిక పాఠశాల, జొన్నగిరి సీజనల్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు ఉమ, సునీల్‌రాజు, ఉపాధ్యాయులు, సీఆర్పీ నాగేష్ పాల్గొన్నారు.

భూమి పరిశీలన

గోనెగండ్ల: స్థానిక చాకలి వీధి సమీపంలో ఉన్న భూమిలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శేషిరెడ్డి గతంలో పట్టాలు పంపిణీ చేసిన భూమిని శుక్రవారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉన్నా తిరిగి స్వాధీనం చేసుకొని అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ టీ.నసురుద్దీన్, మాజీ సర్పంచ్ నాగేష్ నాయుడు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మన్సూర్, కన్వీనర్ దొరబాబు, బందెనవాజ్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి

ఆలూరు: వైఎస్సార్‌సీపీ నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం వివిధ మండలాలకు చెందిన సచివాలయ, మండల కన్వీనర్లతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను గెలించుకోవడానికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ విధివిధానాలు, చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించాలన్నారు. సమావేశంలో ఆయా మండలాల కన్వీనర్లు వీరేష్, పెద్దయ్య, షఫిఉల్లా, భీమప్ప, సచివాలయ కన్వీనర్లు ఈరన్న, రాజారెడ్డి, వెంకన్న, మల్లికార్జున, పట్టభద్రులు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మఠంలో ద్వాదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయంరూరల్ : శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం ద్వాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మఠం అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు తరలిరావడంతో మఠం పరిసరాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువజామునుంచి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథాలపై అధిష్టింపజేసి ఊరేగించారు.

బండేగురుడి జాతర సందడి



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

నందవరం: మహిమాన్వితుడు సద్గురు వర బండే గురుడి జాతర ఉత్సవంలో భాగంగా మూడవ రోజు శుక్రవారం పూలచింత గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు, గ్రామస్తులతో దుకాణాల వద్ద సందడి కనిపించింది. జాతరలో గాజుల దుకాణం, చిన్నారుల బొమ్మలు, రంగుల రాట్నం, నేతి మిఠాయిలు, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన జంపింగ్ నెట్ ఆకర్షణీయంగా నిలిచాయి. చిన్నారులు జంపింగ్ నెట్, డ్రాగన్ ఊయలలు, కారు వీల్ చక్రాలు తిరుగుతూ కేరింతలతో ఆనందపడ్డారు. గాజుల దుకాణం వద్ద ఆడపడచుల గాజుల కొనుగోళ్లతో సందడి కనిపించింది. జాతరలో నేతి మిఠాయిలు, తినుబండారాలను ప్రజలు కొనుగోలు చేశారు.

రీసర్వే వేగవంతం

ఆలూరు రూరల్: జగనన్న భూహక్కు – భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే వేగవంతం చేసినట్లు ఆలూరు తహసీల్దార్ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆలూరు, హాలహర్వి మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, గ్రామ కంఠం, దేవదాయ భూముల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. రైతులకు ముందుగా నోటీసులు అందించి వారి సమక్షంలో పొలాల హద్దులు గుర్తిస్తున్నట్లు చెప్పారు. వివరాల నమోదు అనంతరం డ్రోన్‌ల సహాయంతో సర్వే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ఇప్పటివరకు మండలంలోని కాత్రికి, గోనేహాల్ గ్రామాల్లో వంద శాతం భూ సర్వే చేసి హక్కు పత్రాలు అందించామన్నారు. భూ రక్ష సర్వేకు రైతులు సహకరించాలని కోరారు.

వేసవిలో తాగునీటి సమస్య రానివ్వొద్దు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

గోనెగండ్ల: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ టీ. నసురుద్దీన్ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర భూసర్వే ప్రారంభించిందని, ఆయా గ్రామాల్లో రెండవ విడత సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పీఆర్‌ఏఈ శివశంకర్ మాట్లాడుతూ మండలంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే అలువాల నుంచి బెళగల్, అయ్యకొండ నుంచి కడిమెట్ల, ఎర్రబాడు నుంచి తిప్పనూరు వరకు బీటీ రోడ్డుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎంఈఓ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలో ఆయా పాఠశాలల్లో రెండవ విడత నాడు–నేడు పనులు జరుగుతున్నాయని వివరించారు. అలాగే 'పది' పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యపై సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అలాగే గ్రామ సచివాలయాల్లో 545 సర్వీసులను అందిస్తున్నారని, వాటిని ప్రజలకు తెలియజెప్పాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ సూచించారు. వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ రావూఫ్, బందెనవాజ్, ఎంపీటీసీ రజియా సుల్తానా, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

19న వైద్య శిబిరం

పత్తికొండ రూరల్: స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో ఈ నెల 19న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కొత్తపల్లి అజయ్, హేమంత్ శుక్రవారం తెలిపారు. శాంతిరాం ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్న శిబిరంలో అన్నిరకాల సమస్యలకు ఉచితంగా చికిత్స చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు సెల్ 73827 23137, 94934 57961 నంబర్లను సంప్రదించాలన్నారు.

గడ్డివామి దగ్ధం

కోసిగి: మండలంలోని గౌడగల్లు గ్రామంలో చిలకప్ప అనే రైతుకు చెందిన గడ్డివామి శుక్రవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన కుమ్మరి రాజు తన దిబ్బకు నిప్పు పెట్టి వెళ్లిపోయాడు. పక్కనున్న గడ్డివాముకు మంటలు విస్తరించాయి. పశువుల కోసం నిల్వ ఉంచుకున్న గడ్డి దగ్ధం కావడంతో రాజుపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.